క్లుప్తంగా

జాయింట్ ఖాతాలు ప్రారంభించాలి

విస్సన్నపేట: జగనన్న విద్యాదీవెనకు సంబంధించి తల్లి, విద్యార్థులు జాయింట్ బ్యాంక్ ఖాతాలు ఈ నెల 24వ తేదీ లోగా ఓపెన్ చేయించాలని ఎంపీడీఓ ఎస్.వెంకటరమణ పేర్కొన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో విద్యాదీవెన జాయింట్ ఖాతాలకు సంబంధించి వెల్ఫేర్ అసిస్టెంట్లకు శనివారం సమావేశం నిర్వహించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

గంపలగూడెం: ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో ఈ నెల 17న జరిగిన జిల్లా స్థాయి త్రోబాల్ పోటీల్లో గంపలగూడెం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అండర్-17లో పదో తరగతి విద్యార్థి విక్రమ్, అండర్-14లో ప్రమోద్, వెంకటేశ్వరరావు రాష్ట్ర జట్టులో ఆడతారని వ్యాయామోపాధ్యాయుడు రాంబాబు శనివారం తెలిపారు. విద్యార్థులను ప్రధానోపాధ్యాయుడు కొండలరావు అభినందించారు.

అభివృద్ధిపై సమీక్ష

ఇబ్రహీంపట్నం: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ పాలడుగు జోత్స్న అధ్యక్షతన శుక్రవారం జరిగింది. గ్రామాల్లో జరిగిన అభివృద్ధి, సంక్షేమంపై అధికారులు సభ్యుల మధ్య సుదీర్ఘ చర్చ జరిగింది. సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పార్టీలు, కులాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని అర్హులందరికీ చేరేలా అధికారులు కృషి చేయాలని ఎంపీపీ కోరారు. ఎంపీడీఓ రామకృష్ణనాయక్, ఏఓ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రతిభా స్కాలర్‌షిప్‌కు ఎంపిక

తిరువూరు: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు కేంద్రప్రభుత్వ మానవ వనరుల శాఖ ఇచ్చే ప్రతిభా స్కాలర్‌షిప్‌లకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ మురళీకృష్ణ తెలిపారు. ఇంటర్మీడియట్‌లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ఏడాదికి రూ.20 వేల చొప్పున నాలుగు సంవత్సరాల పాటు ఈ ఉపకార వేతనం లభిస్తుందని తెలిపారు.

శ్మశానవాటికల్లో బోర్ల ఏర్పాటు

ఆగిరిపల్లి: చిన్నాగిరిపల్లి శివారులోని సింగనగూడెం, గొల్లగూడెంలోని శ్మశానవాటికల్లో శనివారం బోర్లను వేశారు. ఈ రెండు శ్మశానాల్లో నీటి సదుపాయం లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో రెండుచోట్ల బోర్లు వేసేందుకు మండల పరిషత్ నుంచి రూ.3 లక్షలు మంజూరు చేశారు. దీంతో ఆ నిధులతో బోర్లను వేశారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు నరసింహారావు, నాయకులు జమదగ్ని పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా పేదలకు భరోసా

ముసునూరు: వైఎస్సార్ బీమా పథకం పేదలకు భరోసా కల్పిస్తుందని ఎంపీటీసీ సభ్యురాలు రమాదేవి పేర్కొన్నారు. మండలంలోని చెక్కపల్లి గ్రామానికి చెందిన పల్లి రవివర్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. అతను వైఎస్సార్ బీమా పథకంలో సభ్యుడు కావడంతో మట్టి ఖర్చుల నిమిత్తం రూ.10 వేలను నామినీగా ఉన్న అతని భార్య రోజాకు శనివారం అందజేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు మురళి, రమేష్ పాల్గొన్నారు.

పేదలకు అండగా సీఎం వైఎస్ జగన్


సీఎం మంజూరు చేసిన చెక్కును లబ్ధిదారుడికి అందజేస్తున్న ఎమ్మెల్యే వెంకట ప్రతాప్‌అప్పారావు

నూజివీడు: పేదల కష్టసుఖాలను తెలుసుకుని వాటిని పరిష్కరించి వారికి అండగా ఉండటంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎల్లప్పుడూ ముందుంటారని ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. పట్టణంలోని కొత్తపేటకు చెందిన శీలం ప్రభుకుమార్ మెంటల్లీ రిటైర్డ్ కావడంతో పాటు, పుట్టుకతో పోలియోబారిన పడటంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాడు. దీంతో ఈ విషయాన్ని తండ్రి శీలం నాగమురళీకృష్ణ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకురావడంతో సీఎం వెంటనే స్పందించి రూ.లక్ష మంజూరు చేశారు. దీనికి సంబంధించిన చెక్‌ను శనివారం ఎమ్మెల్యే మేకా ప్రతాప్ అప్పారావు చేతుల మీదుగా లబ్ధిదారుడికి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమన్నారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ గాదిరెడ్డి శ్రీలత, మున్సిపల్ వైస్ చైర్మన్ పగడాల సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు శీలం రాము, నాయకులు గాదిరెడ్డి రంజిత్ రెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆటలపోటీలు

విస్సన్నపేట: గ్రంథాలయ వారోత్సవాలు సందర్భంగా స్థానిక గ్రంథాలయంలో విద్యార్థుల కు రన్నింగ్, మ్యూజికల్‌చైర్, చెస్, క్యారమ్స్ పోటీలను శనివారం నిర్వహించారు. న్యాయనిర్ణేతలుగా ఉపాధ్యాయులు వ్యవహరించారని లైబ్రేరియన్ భాను తెలిపారు.

జి.కొండూరులో..

జి.కొండూరు: జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా స్థానిక గ్రంథాలయంలో విద్యార్థులకు చిత్రలేఖనం, లెమన్ అండ్ స్పూన్ పోటీలను శనివారం నిర్వహించారు. ఈ పోటీలకు స్థానిక ప్రభుత్వ పాఠశాల, దివ్యాంగుల పాఠశాల నుంచి 45 మంది విద్యార్థులు హాజరైనట్లు గ్రంథాలయాధికారి విజయకృష్ణ తెలిపారు.

పెనుగొలనులో..

పెనుగొలను(గంపలగూడెం): మత్తుపదార్థాల వినియోగంతో జీవితం అస్తవ్యస్తమవుతుందని గంపలగూడెం ఏఎస్‌ఐ దేవర వెంకటేశ్వర్లు అన్నారు. మండలంలోని పెనుగొలను గ్రంథాలయంలో శనివారం జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు మాదకద్రవ్యాలతో అనర్థాలపై అవగాహన శనివారం సదస్సు నిర్వహించారు. గ్రంథాలయాధికారి శ్రీలత, ఉపాధ్యాయులు నరసింహారావు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్విజ్ పోటీలు

చాట్రాయి: మండలంలోని చనుబండ, చాట్రాయి గ్రంథాలయాల్లో శనివారం గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. గ్రంథాలయ అధికారులు శ్రీకాంత్, మణికంఠ పాల్గొన్నారు.

రెడ్డిగూడెంలో..

రెడ్డిగూడెం: గ్రంథాలయం వారోత్సవాలను జెడ్పీ హెచ్ స్కూల్, గీతాంజలిస్కూల్లో శనివారం నిర్వహించారు. 8, 9 తరగతుల విద్యార్థులకు నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. రెడ్డిగూడెం జెడ్పీహెచ్ఎస్ హెచ్ఎం ధర్మశీలి, సత్యనారాయణ, మల్లికార్జునరెడ్డి పాల్గొన్నారు.

తిరువూరులో..

తిరువూరు: గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో శనివారం విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖన, క్విజ్ పోటీలు నిర్వహించారు. పోటీ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఉపకరించే విధంగా జనరల్ నాలెడ్జ్, కరెంట్ ఆఫైర్స్‌లో క్విజ్ పోటీలను నిర్వహించినట్లు గ్రంథాలయాధికారి పద్మావతి తెలిపారు.

ముసునూరు అభివృద్ధికి కృషి

నూతన ఎంపీపీ దుర్గాభవాని


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ, పార్టీ నేతలు

ముసునూరు: మండల కేంద్రం అభివృద్ధికి కృషి చేస్తానని నూతన ఎంపీపీ కొండా దుర్గాభవాని హామీ ఇచ్చారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు ఎం.నాగవల్లేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. చారిత్రక నేపథ్యం గల మండల కేంద్రం ముసునూరును అన్ని పార్టీ నేతల సహకారంతో పేరుకు తగినట్లుగా అభివృద్ధి చేస్తామన్నారు. సీసీ రోడ్లు, డ్రెయినేజీలు, వీధిలైట్లు తదితర సమస్యలపై తక్షణ చర్యలు చేపడతామన్నారు. ఇప్పటికే సింహాద్రిపురం-కొర్లగుంట రహదారికి రూ.34 లక్షలు, వెంకటాపురం-యల్లాపురం రహదారికి రూ. 55 లక్షలు, అక్కిరెడ్డిగూడెం-గోగులంపాడు రహదారికి రూ. 17లక్షలు పంచాయతీ రహదారుల నిర్మాణాలకు నిధులు మంజూరు కాగా, టెండర్లు పూర్తయ్యాయన్నారు. అధికారుల, పార్టీ పెద్దలు, ప్రతిపక్షాల సహకారంతో మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపేందుకు కృషిచేస్తానని ఆమె అన్నారు. వైస్ ఎంపీపీలు రాజానాయన, గంగాధర్, ఎంపీటీసీలు లక్ష్మి, వెంకమ్మ, సర్పంచ్ వాణి పాల్గొన్నారు.

ముసునూరు ఎంపీపీకి ఎమ్మెల్యే అభినందనలు

ముసునూరు: ముసునూరు నూతన ఎంపీపీ కొండా దుర్గాభవానిని ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అభినందించారు. ఇటీవల ఎంపీపీగా బాధ్యతలు చేపట్టిన రమణక్కపేట ఎంపీటీసీ కొండా దుర్గాభవాని దంపతులు శనివారం ఎమ్మెల్యేను మర్యాద పూర్వకంగా కలిశారు.

ప్రభుత్వాస్పత్రి భవనాలు త్వరలో ప్రారంభం

ఎమ్మెల్యే రక్షణనిధి


తిరువూరు ప్రభుత్వాస్పత్రి నూతన భవనాలు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రక్షణనిధి

తిరువూరు: తిరువూరు ప్రభుత్వాస్పత్రిలో రూ.5కోట్లతో నిర్మించిన అదనపు భవనాలను త్వరలో ప్రారంభిస్తామని ఎమ్మెల్యే కే రక్షణనిధి తెలిపారు. ఆస్పత్రిలో నిర్మాణం జరిగిన భవనాలను శనివారం ఆయన సందర్శించారు. రోగులకు అత్యాధునిక వైద్యసేవలందించేందుకు ప్రభుత్వం కృషిచేస్తోందన్నారు. ఇప్పటికే ఆస్పత్రిలో ఆరోగ్యశ్రీ పథకం కింద రోగులకు వైద్యసేవలందించడంతో పాటు అత్యవసర సేవలకు జిల్లా ఆస్పత్రికి రిఫర్ చేస్తున్నారని, చిన్నపిల్లలకు, గర్భిణులకు కూడా వైద్యసేవలు అందుబాటులో ఉన్నాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. వైద్యాధికారి గార్గేయ, జెడ్పీటీసీ సభ్యుడు యరమల రామచంద్రారెడ్డి, నగరపంచాయతీ చైర్‌పర్సన్ గత్తం కస్తూరిబాయి, వార్డు కౌన్సిలర్లు పరసా శ్రీనివాసరావు, ఏరువ ప్రకాష్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు నాగేశ్వరరావు, గోపాల నాగేశ్వరరావు, సత్యనారాయణ, శ్రీనివాసరావు, చంటి పాల్గొన్నారు.

వేంపాడు భూముల సమస్యలపై వినతి

నూజివీడు: మండలంలోని గొల్లపల్లిలో వేంచేసియున్న శ్రీరఘునాథస్వామి ఆలయానికి చెందిన వేంపాడు భూముల సమస్యను పరిష్కరించాలని కోరుతూ వైఎస్సార్ సీపీ నాయకులు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. గ్రామానికి చెందిన పార్టీ నాయకులు చల్లారి రాఘవ, మేరుగ లెనిన్ ఈమేరకు సీఎం వైఎస్ జగన్‌ను కలిసి సమస్యను వివరించారు. వందలాది మంది పేదలు ఈ భూములను దశాబ్దాల కాలంగా సాగు చేసుకుంటున్నారని, 2016లో టీడీపీ ప్రభుత్వం జారీచేసిన జీఓ నంబరు 79, 102లను అడ్డం పెట్టుకుని దేవదాయశాఖ అధికారులు సన్న, చిన్నకారు రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. వివాద పరిధిలోకి రాని భూములను వేంపాడు రైతులకు జీవో వర్తించకుండా భూముల సర్వే సెటిల్‌మెంట్ చేయించాలని కోరారు. దీనిపై స్పందించిన సీఎం భూముల సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చినట్లు నాయకులు పేర్కొన్నారు.

22 నుంచి శోభనాచలుడి బ్రహ్మోత్సవాలు

ఆగిరిపల్లి: జిల్లాలో ప్రసిద్ధి గాంచిన ఆగిరిపల్లి శోభనగిరిపై వెలిసిన శ్రీ శోభనాచల వ్యాఘ్ర లక్ష్మీ నరసింహస్వామి వార్ల వార్షిక బ్రహ్మోత్సవం, కృత్తిక దీపోత్సవ కార్యక్రమాలను ఈ నెల 22 నుంచి 28వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణ అధికారి ఎస్.భవాని, ఆలయ అర్చకులు వేదాంతం శేషుబాబు శనివారం తెలిపారు. 24న శ్రీవారి శోభనగిరి ప్రదక్షిణ, 25న కొండపై మూడు గుళ్ల వద్ద స్వామికి శాంతి కల్యాణం, 26న దివ్య తిరుకల్యాణం, గరుడ వాహనోత్సవం, 27న చక్రస్నానం, సాయంత్రం ఆలయం కోవెల వద్ద కృత్తిక దీపోత్సవం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

విద్యార్థులకు ప్రేరణ తరగతి నిర్వహణ

నూజివీడు: గొల్లపల్లి జెడ్పీ హైస్కూల్లో శనివారం విద్యార్థులకు ప్రేరణ తరగతిని నిర్వహించారు. మానసిక నిపుణులు రమాదేవి, శ్రావణి, దాక్షాయణి, పద్మావతి విద్యార్థులకు అనేక విషయాలను వివరించారు. హెచ్ఎం రాధికారాణి పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

నూజివీడు: యువత మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని నవజీవన్ బాలభవన్ జోనల్ కో-ఆర్డినేటర్ రవి అన్నారు. బాలల హక్కుల వారో త్సవాల్లో భాగంగా మండలంలోని సిద్ధార్థనగర్ ఎంపీ యూపీ స్కూల్లో శనివారం మాదక ద్ర వ్యాల నిర్మూలనలో యువత పాత్ర అనే అంశంపై వక్తృత్వ పోటీలను నిర్వహించారు.

సంక్షిప్త వార్తలు

స్వల్పకాలిక కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

నూజివీడు: నిరుద్యోగ యువతీ యువకుల్లో నైపుణ్యాలను అభివృద్ధి చేసి ఉపాధి కలిపించేందుకుగాను రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన సంయుక్త ఆధ్వర్యంలో స్వల్పకాలిక శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి గంటా సుధాకర్ శనివారం తెలిపారు. ఇందులో భాగంగా అసిస్టెంట్ ఎలక్ట్రీషియన్, అసోసియేటివ్ డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సులకు స్వల్పకాలిక శిక్షణను పట్టణంలోని ఐటీఐ కళాశాలల్లో ఏర్పాటు చేశామన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థుల నుంచి ఈ నెల 25వ తేదీ లోగా దరఖాస్తులు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. పదో తరగతి, ఐటీఐ పూర్తిచేసిన 30 ఏళ్ల లోపు వయస్సున్న వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు స్కిల్ హబ్ కో-ఆర్డినేటర్ రామకృష్ణ, 83740 39719కు ఫోన్ చేసి సంప్రదించాలని పేర్కొన్నారు.

పంటనష్టం నమోదు చేయించుకోవాలి

తిరువూరు: వర్షాభావ పరిస్థితుల కారణంగా తిరువూరును కరువు మండలంగా ప్రభుత్వం ప్రకటించినందున పంట నష్టపోయిన రైతులు తమ వివరాలను ఆర్బీకేలలో నమోదు చేయించుకోవాలని వ్యవసాయాధికారి పద్మ కోరారు. ఈ నెల 20లోపు ఆర్బీకేలలో వ్యవసాయ సహాయకులు రైతుల వివరాలను నమోదు చేయాలని, 21 నుంచి 25వ తేదీ వరకు రైతుల జాబితాలను ఆర్బీకేలలో సామాజిక తనిఖీ నిమిత్తం ప్రదర్శిస్తామని తెలియజేశారు.

నైపుణ్యం వెలికి తీసేందుకు టాలెంట్ హంట్

మైలవరం: విద్యార్థుల్లోని నైపుణ్యాలను వెలికి తీసేందుకు టాలెంట్ హంట్ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఇళ్ల రవి తెలిపారు. మైలవరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం టాలెంట్ హంట్ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో డ్యాన్స్, పెయింటింగ్, రీల్స్, రంగోలి, మిమిక్రీ, క్విజ్, మ్యూజిక్, స్కిట్స్, సింగింగ్ తదితర పది రకాల ఈవెంట్స్‌పై కళాశాల విద్యార్థులకు పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ చదువుతో పాటు విద్యార్థులు కల్చరల్ యాక్టివిటీస్‌పై కూడా పట్టు సాధించాలన్నారు. విజేతలను మచిలీపట్నం కృష్ణా యూనివర్సిటీలో నవంబర్ 30, డిసెంబర్ 1, 2 తేదీలలో జరిగే కృష్ణ తరంగ్-2023కు కళాశాల తరఫున పంపనున్నట్లు తెలిపారు.

బాలల హక్కులు కాపాడాల్సిన బాధ్యత అందరిదీ

మైలవరం: బాలల హక్కులు కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఎంపీడీఓ లక్ష్మీకుమారి తెలిపారు. మైలవరం సీడీపీఓ కార్యాలయంలో జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ, చైల్డ్‌రైట్స్ అడ్వకేట్ ఫౌండేషన్(సీఆర్ఏఎఫ్) సంయుక్త ఆధ్వర్యంలో బాలల హక్కుల వారోత్సవాల్లో భాగంగా బాల్య వివాహాల నిరోధక చట్టం, డ్రగ్స్ నియంత్రణ, దత్తత నియమావళిపై అవగాహన సదస్సు శనివారం జరిగింది. జెడ్పీటీసీ ఎస్. తిరుపతిరావు, ఎస్సై హరిప్రసాద్ పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

చాట్రాయి: రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతన్నలు సద్వినియోగం చేసుకోవాలని ఏపీ కో ఆపరేటివ్ యూనియన్ రాష్ట్ర చైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి కోరారు. శనివారం మండలంలోని నరసింహారావుపాలెం పీఏసీఎస్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో మండల పరిషత్ ఉపాధ్యక్షుడు సుబ్బారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్లు బాబ్జీ, నాగేశ్వరరావు, చెన్నారావు, వెంకటరెడ్డి పాల్గొన్నారు.

సహకార సంఘాలను బలోపేతం చేద్దాం

చాట్రాయి: రైతులకు దోహదపడుతున్న సహకార సంఘాలను బలోపేతం చేద్దామని ఏపీ కో ఆపరేటివ్ యూనియన్ రాష్ట్ర చైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి తెలిపారు. మండలంలోని నరసింహారావుపాలెం గ్రామంలో శనివారం నిర్వహించిన సహకార 70వ అఖిల భారత సహకార వారోత్సవాల కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సొసైటీ చుట్టూ ప్రహరీ గోడ నిర్మాణానికి గోడౌన్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని మండల పరిషత్ ఉపాధ్యక్షుడు పుచ్చకాయల సుబ్బారెడ్డి కోరగా తగిన ప్రతిపాదనలు పంపాలని జిల్లా ఆడిట్ అధికారి శ్రీనివాసరావు అధికారులను సూచించారు. సర్పంచ్ ప్రశాంతి, సహకార శిక్షణ కేంద్రం అధికారి ఆర్.శ్రీనివాసరావు, పీఏసీఎస్ చైర్మన్లు బాబ్జీ, చెన్నారావు, నాగేశ్వరరావు, వెంకటరెడ్డి, సహకార సంఘాల సీఈఓలు పాల్గొన్నారు.

పథకాల అమలుపై మరింత శ్రద్ధ

ముసునూరు: ప్రభుత్వ పథకాలను ప్రజలకు అందించడంలో మరింత శ్రద్ధ వహించాలని సర్వసభ్య సమావేశం నిర్ణయించింది. ఎంపీడీఓ జి.రాణి ఆధ్వర్యంలో నూతన ఎంపీపీ కొండా దుర్గాభవాని అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ శాఖల ద్వారా చేసిన అభివృద్ధి పనులను అధికారులు వివరించి, భవిష్యత్ ప్రణాళికలను సభకు తెలిపారు. వ్యవసాయాధికారి మధుమోహన్, సివిల్ సప్లై డీటీ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మండలంలో ఐదు వేల ఎకరాల్లో వరి పంట పండిందని, 850 ఎకరాల్లో పంట కోత పూర్తయిందని తెలిపారు.ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సత్యప్రసాద్, వైస్ ఎంపీపీలు రాజానాయన, గంగాధర్, సొసైటీ అధ్యక్షుడు నాగవల్లేశ్వరరావు, తహసీల్దార్ దాసరి సుధ పాల్గొన్నారు.

ప్రకటన

తిరువూరు, ది.18-11-2023

ప్రకటన

తిరువూరు, ది.18-11-2023